

# కథ

డా.కొఠారి వాణీచలపతిరావు

# మైండ్ సెట్

పదిహేను సంవత్సరాల తర్వాత కావేరిని కలుసుకోబోతున్నందుకు నా మనసంతా ఆనందోద్వేగాలతో నిండి పోయింది. ట్రైన్‌లో.. కిటికీ దగ్గర కూర్చుని గతంలోకి వెళ్లిపోతే..నా ఆలోచనల నిండా కావేరీ పరుచు కుంది. కాలేజీ లైఫ్‌లో కావేరీ కేవలం నా క్లోజ్ ఫ్రెండ్ మాత్రమే కాదు.. 'నా సర్వస్వం తనే' అన్నంతగా అయిపో యింది. ఆ వయసుకీ కావేరికి ఎంతటి లోకజ్ఞానం.. ఎంతటి విచక్షణ ఉండే వని! ఆరిందలా నాకు ఎన్నో విష యాలు చెప్పేది.. ఎన్నో సలహాలు ఇచ్చేది..! ఒక్కోసారి సున్నితంగా మందలించేది.. మరోసారి సివంగిలా మీదపడి కరిచినంతగా కోపంతో అరి చేది.

కావేరి నా మీద చూపించే ఆ స్నేహం, ప్రేమ, చనువు, అధికారం.. వీటన్నిటి మూలంగానో ఏమో 'తను లేకపోతే నాకు తెల్లవారదు. పొద్దు గూకదు' అన్నంతగా ప్రతీదానికీ దానిమీద ఆధారపడటానికి అలవాటు పడిపోయాను.

నా దైనందిన జీవితంలో ఎదురైన ప్రతి చిన్న సమ స్యనూ దాని ముందుంచి గుండెభారం దించుకునే దాన్ని. దాని సానుభూతిని, 'నువ్వే కరెక్ట్' అన్న ప్రశం సనూ నేను ఎదురుచూస్తున్న సమయంలో ఉన్న ట్టుండి "నీకసలు బుద్ధిలేదే భవానీ!" అంటూ నన్నే చివాట్లు పెట్టేది. అందుకు ముందు నాకు కోపం వచ్చినా అది చెప్పిందంతా విన్న తర్వాత దాని ఆలో చనా విధానం నన్ను అబ్బురపరిచేది. ఈసారి నువ్వే కరెక్ట్ అని పైకి అనకపోయినా.. లోపల మాత్రం అనుకుని అది చెప్పినట్టే చేసేదాన్ని.

గంటల తరబడి నేను ఆలోచించి నిరసనతో, నిరాశతో ఓ వ్యతిరేక నిర్ణయానికి వచ్చిన విషయాన్ని, సమస్యను కావేరి ఒక్క నిముషంలో తేల్చేసి 'ఉఫ్'మని ఊదేసినట్లు మాట్లాడి నాకు ఆశ్చర్యాన్ని, నా మనసుకు ఊరటను, భారరహిత స్థితిని కల్గిం చేది.

ఓ రోజు మా అమ్మకు, నాకు ప్రత్యక్ష యుద్ధం జరిగి ఆ కోపంతో అన్నం కూడా తినకుండా కాలే జీకి వచ్చాను.

"ఎందుకలా ఉన్నావు?" అని పదేపదే నన్ను అడి గింది కావేరి.

"ఏం లేదు!" అన్నాను నేను బింకంగా.

"ఇలా రా!" అంటూ నన్ను ఖాళీగా ఉన్న ఓ రూమ్‌లోకి తీసుకెళ్లి తన బ్యాగులో నుంచి టిఫిన్ బాక్స్ తీసి నా ముందు పెట్టి "తిను" అంది.

'నేను తినకుండా వచ్చానని దీనికెలా తెలిసింది?' అని ఆశ్చర్యపోతూనే "నాకొద్దు" అన్నాను.

"అమ్మ మీద అలిగి అన్నం తినకపోతే మాడేది నీ కడుపే. ఈ ఒక్కపూట మానేసినా మళ్లీ రాత్రికి అమ్మ పంపిన అన్నం తినాలి కదా!" అంది స్పూన్‌తో అన్నం తీసి నా నోట్లో పెడుతూ.

"మా అమ్మకు నేనంటే అస్సలు ప్రేమ లేదు. ఎప్పుడూ అరుస్తూనే ఉంటుంది. నా ఇష్టం వచ్చినట్లు నన్ను ఉండనివ్వకుండా అన్నిటికీ ఆంక్షలు పెడుతూ ఉంటుంది. ఆడపిల్లలు ఇలా ఉండకూడదు.. అలా ఉండకూడదు అంటూ ఎప్పుడూ నసుగుడే. అన్న య్యకు, నాకు పార్షియాలిటీ చూపిస్తుంది. మా ఇంట్లో నాకు మెంటల్ పీస్ లేదు" అని కావేరితో నా బాధను షేర్ చేసుకుంటే అంతా విని అది అదోలా నవ్వింది. వళ్లు మండింది నాకు.

"మీ అమ్మను నువ్వు అర్థం చేసుకుంది ఇదేనా? ఈ ప్రపంచంలో ఎవరయినా చెడ్డవాళ్లు ఉంటారేమో గానీ అమ్మ మాత్రం కాదు. తల్లిదండ్రులెప్పుడూ పిల్లల మంచిని, ఉజ్వల భవిష్యత్తునే కోరుకుంటారు. వాళ్లు మందలించి చెప్పినా, కోపగించి చెప్పినా, కొట్టి చెప్పినా అది మన కోసమే. నువ్వు అన్నం తినకుండా ఆకలి కడుపుతో వచ్చినందుకు మీ అమ్మ ఎంత బాధ పడి ఉంటుందో తెలుసా? తను కూడా నువ్వు ఇంటికి వెళ్లేవరకూ అన్నం తినదు చూడు. మరోసారి అలా అమ్మ మీద అలగకు" అని చెప్పింది మందస్వ రంతో కావేరి.

దాంతో అప్పటివరకూ నా మనసులో ఉన్న ఆలో చనలు తల్లకిందులైనట్టు అనిపించి అమ్మ మీది నా కోపమంతా ఇట్టే ఎగిరిపోయింది.

ఆ సాయంత్రం ఇంటికెళ్లాక కావాలని అమ్మ కొంగు పట్టుకుని తిరుగుతూ బోలెడు ప్రేమను ప్రక టించాను. అమ్మ కళ్లల్లో ఎంతో కాంతి, ముఖంలో సంతృప్తి చూశాక కావేరి చెప్పిన మాటలు నిజమేనని పించాయి.

డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడు 'నిన్ను ప్రేమి స్తున్నా'నంటూ నా వెంటపడ్డ కుమార్ ఆకర్షణలో పడి నేను ఒకరోజు అతనితో కలిసి సినిమాకు వెళ్లాను.

నేను ఎంత రహస్యంగా ఉంచినా అది ఎలా తెలి సిందో కావేరికి తెలిసింది. కొద్దిరోజులుగా దాని చూపులు నన్ను వెంటాడటం.. అనుమానం, ఆందోళ నగా నా వంక చూడటం నేను గమనిస్తూనే ఉన్నాను. కుమార్ నాకిచ్చిన బహుమతులు.. ఆఖరి పిరియడ్ క్లాస్ ఎగ్గొట్టి అతనితో బైక్ మీద నేను కొట్టిన చెక్కర్లు ఏవీ కావేరీ చూపుల నుంచి తప్పించుకోలేక పోవటం నాకు ఆశ్చర్యం కలిగించేది. నన్ను ప్రతిక్షణం గమనిం చడమే కాకుండా నన్ను డైరెక్ట్‌గానో, ఇన్‌డైరెక్ట్‌గానో హెచ్చరిస్తూ ఉండేది.


"భవానీ! జీవితం గాజుపాత్ర లాంటిది. చాలా కేర్‌ఫుల్‌గా హ్యాండిల్ చేయాలి. లేకుంటే చెయిజారి బద్దలైపోతుంది. పగిలి ముక్కలైన దాన్ని తిరిగి అతి కించటం కష్టం. ఆ తర్వాత ఎంత బాధపడ్డా ప్రయో జనం ఉండదు." అంది ఓసారి.

"ఆకర్షణ మనిషిలో విచక్షణాజ్ఞానాన్ని, సంస్కా రాన్ని హరించి వేస్తుంది. శారీరక ఆకర్షణలు

యువత జీవితాలకు శాపాల్లాంటివి. భవిష్యత్తు లేకుండా చేస్తాయి" అంది మరోసారి.

"ఇవన్నీ నాకెందుకు చెబుతున్నావ్?" అని కసురుకుంటే...

"ఎందుకు చెబుతున్నానో నీకెలా తెల్సు.. ఇంకా నటించాలని చూడకు.. భవానీ! నీ మీద ఎన్నో ఆశలుపెట్టుకుని.. నీ భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటున్న మీ అమ్మానాన్నలకు ఈ విషయం తెలిస్తే ఎంత బాధ పడతారో తలవంపులతో ఎంతగా కృంగిపోతారో ఎప్పుడయినా ఆలోచించావా? నువ్వు అడ్డదారిన నడిస్తే ఈ సమాజం నీకన్నా ముందు నిన్ను కన్నవాళ్ల పెంపకాన్ని వేలెత్తి చూపిస్తుంది. నిన్ను నవమాసాలు మోసి, కనిపెంచిన నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతగా నువ్వు ఇచ్చే బదులు ఇదేనా?" అంది కావేరి తీక్షణంగా నా కళ్లలోకి చూస్తూ. సిగ్గుతో తలవంచుకున్నాను నేను.



ఆ రోజు నుంచీ కుమార్‌తో మాటలు, తిరుగుళ్లు బంద్ చేశాను. వారం తిరక్కుండానే మరో అమ్మాయితో క్లోజ్‌గా మాట్లాడుతూ కనిపించిన కుమార్‌ని చూసి అతనికి నా మీద ఉన్న ప్రేమ ఎంత గొప్పదో అర్థమై నా కళ్లు తెరుచుకున్నట్లు అయింది. ఈ రోజు నా జీవితం ఇంత అందంగా, ఆనందంగా ఉందంటే అందులో ఆనాటి కావేరి ప్రమేయం కూడా ఉందని అనిపిస్తూ ఉంటుంది ఇప్పటికీ నాకు ఆలోచిస్తుంటే.

ఆ వయసులోనే అంతటి సంస్కారం, పెద్దరికం, విచక్షణను స్వంతం చేసుకున్న కావేరి.. ఇప్పుడు ఇంకెంతో గొప్ప వ్యక్తిత్వంతో ఉన్నతమైన జీవితాన్ని గడుపుతుండవచ్చు. తనకు ఇద్దరు పిల్లలట. ఆమె పెంపకంలో పెరుగుతున్న ఆ ఇద్దరు పిల్లల గురించీ ఇక ఎంత చెప్పినా తక్కువే అవుతుందేమో. రైలు నేను దిగవలసిన స్టేషన్‌కి చేరుకోవడంతో నా ఆలోచనలూ అక్కడితో ఆగిపోయాయి.

★ ★ ★

నా కళ్లు ఆత్రుతగా కావేరి కోసం ప్లాట్‌ఫాం ఆ మూల నుంచీ వెతుకుతూ వస్తున్నాయి.


మా కంపార్ట్‌మెంట్ ఎక్కడ ఆగిందో అక్కడే ఎదురుగా నిల్చుని ఉన్న కావేరి కనిపించింది.

నేను తనను చూసినప్పుడే తనూ నన్ను చూసింది. అదే చిరునవ్వు!

కళ్లలో అదే కాంతి!

ముఖంలో అదే గాంభీర్యం!

కాస్త లావై మంచి పర్సనాలిటీతో నిండుగా, హుందాగా కనిపించింది. ప్రౌఢత్వంలో కూడా ఓ అందం ఉంటుంది అనిపించింది తనను చూస్తుంటే.



నేను కిందికి దిగగానే ఆనందోద్వేగాలతో నన్ను కౌగిలించుకుని- "ఎన్నాళ్లయిందే భవానీ.. నిన్ను చూసి పదిహేనేళ్లయ్యింది కదూ!" అంటుంటే దాని కళ్లల్లో ఆనందభాష్పాలు.

ఆ స్నేహమాధుర్యం నన్నూ ఉద్విగ్నతకు గురిచేసింది. నా బ్యాగు తను అందుకుని ముందుకు నడిచింది కావేరి. తన వెంట నేనూ నడిచాను. కారు పార్కింగ్ వైపు నడిచి డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారు బయటకు తీసింది. ఒక పక్కన డ్రైవింగ్ చేస్తూనే మాట్లాడుతోంది. తన పక్కన కూర్చుని ఆ మాటలను ఎంజాయ్ చేశాను నేను.

"నిన్ను చూడగానే నాకు మన కాలేజి... ఆ వాతావరణం... ఆ లైఫ్

అన్నీ గుర్తుకొస్తున్నాయి. ఎంత చక్కని జీవితమో కదా అది!" అంది.

"నీకు ఇద్దరు పిల్లలు కదూ.. ఏం చేస్తున్నారే? వాళ్లను కూడా తీసుకుని రావల్సింది!" అంది.

"అమ్మాయి టెన్త్. అబ్బాయి ఇంటరు! వాళ్లు ఇంకా చిన్నపిల్లలా నా కూడా రావటానికి ఈ కాలం పిల్లలు వాళ్ల ఫ్రెండ్స్, వాళ్ల సర్కిల్ తప్ప పెద్దవాళ్లతో కలుస్తారా? మీ లైఫ్ మీది. మా లైఫ్ మాది.. మీకూ మాకూ.. కలవదు.. జనరేషన్ గ్యాప్ అన్నట్టుగా అంటీముట్టనట్టుగా ఉంటారు" అన్నాను.

"అందుకే చిన్నప్పటి నుంచే వాళ్లను ఎక్కడికెళ్లినా వెంట తీసుకెళ్లాలి మనం. అప్పుడే అలవాటవుతుంది. మన స్నేహితులు, బంధువర్గం.. వాళ్ల పిల్లలు.. ఇలా అందరితో కల్సి ఆటపాటలు ప్రేమ ఇచ్చిపుచ్చుకోవడాలు తెలుస్తాయి" అంది.

"వింటేనా?" అన్నాను నేను.

కావేరి ఇల్లు చేరడానికి అరగంట పట్టింది.

చిన్నదయినా అందంగా ఉంది ఇల్లు! పిల్లలు సుగంధి, సౌరభ్ చూడముచ్చటగా ఉన్నారు.

"అంటీ..అంటీ" అంటూ నా దగ్గరే కూర్చుని కబుర్లు చెప్పారు. నా రాక తాలూకు ఆనందం వాళ్ల కళ్లల్లో తళుక్కున మెరుస్తోంది. అది నిజమేనన్నట్టుగా కావేరి అంది. "వీళ్లకు ఇంటికి గెస్టులు వచ్చారంటే ఎంత సంతోషమో. వాళ్లు ఉన్నన్ని రోజులూ ఇక నా దగ్గరికి రారు" అంది.

కావేరి అలా అంది గానీ ఆ పిల్లలు తల్లికి ఎంత క్లోజో వాళ్లు ఆమెతో మాట్లాడుతున్న తీరు, మసలుతున్న తీరు చూసి నాకు అర్థమయింది. కానీ-

రెండు రోజులుండి గమనించిన తర్వాత కావేరి పిల్లలతో మాట్లాడుతున్న తీరు నాకెన్నో సందేహాలను కలిగిస్తూ.. నాకు తెలియకుండానే నా మనసులో కొంచెం నిరసన, వ్యతిరేకత చోటుచేసుకోవడం మొదలుపెట్టింది.

"సుగంధీ! ఆంటీకి మంచినీళ్లివ్వు! సౌరభ్! కొంచెం బజారుకెళ్లి ఆంటీకి ఏవో సామాన్లు కావాలట. తెచ్చి పెట్టు" అంటూ నా పనులన్నీ పురమాయిస్తు పిల్లలతో చేయిస్తోంది. వయసుకు తగ్గట్టుగా కావేరీలో కొంత అలసత్వం, బద్ధకం వచ్చి చేరినట్లుగా నాకనిపించింది. అంతేకాదు కావేరీతో కొంచెం డబ్బు యావ కూడా వచ్చి చేరినట్లుగా ఆమె మాటలు ఆమె మనసు తీరును పట్టి ఇచ్చాయి. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కొడుకు చెయ్యి పట్టుకుని కాసేపూ, తల నిమురుతూ కాసేపూ "నా కొడుకు చూస్తూ చూస్తూండగానే ఇంజనీరు అయిపోతాడు. సంపాదనపరుడైనాక అమ్మనూ, నాన్ననూ అరచేతిలో పెట్టుకుని చూసుకుంటాడు. చెల్లెలంటే ఎంత ప్రేమో వాడికి. వాళ్ల నాన్నకయితే ఇక కుడిభుజమే వాడు. తల్లిదండ్రులను పట్టించుకునే పిల్లలు ఉండటం అదృష్టం కదూ భవానీ!" అంది నిన్న. ఈ రోజు కూతురు సుగంధి వచ్చి తన వడిలో పడుకున్నప్పుడు 'ఆడపిల్లయినా ఇది నా కొడుకుతో సమానం. నేను పెళ్లి చేసుకుని 'ఆడ' పిల్లగా వెళ్లిపోయినా 'పుట్టింటి బాధ్యతలను మర్చిపోను. మీరిద్దరూ అన్నయ్య దగ్గర ఎలా ఉంటారో నా దగ్గరకూ వచ్చి అలాగే ఉండాలి. 'ఆడపిల్ల' అంటూ నన్ను వేరు చేసి చూస్తే మాత్రం నేను అస్సలు ఊరుకోను' అంటుంది. ఈ కాలం ఆడపిల్లలు వెనకటికాలం ఆడపిల్లల్లా కాదు భవానీ! అన్నింటా మగపిల్లల్ని మించిపోతున్నారు. 'వంశోద్ధారకులు మగపిల్లలే కాదు మేము కూడా.. అంటున్నారు" అంది నవ్వుతూ.

కావేరి మాటలు నాకెందుకో అంతగా నచ్చలేదు. వచ్చిన దగ్గరి నుంచీ.. రెండు రోజులుగా చూస్తున్నాను. ఆ మాటలు.. ఆమె బిహేవియర్ కావేరీలో నాకు ఒక కొత్త కావేరిని.. మారిన కావేరిని పట్టి ఇస్తున్నాయి.

తనలో ఇంతటి స్వార్థం ఎప్పుడు ప్రవేశించింది?

పిల్లలను కని పెంచి పెద్ద చేసి ప్రయోజకులను చేసేది రేపు వాళ్లు బాగా సంపాదించి తాము వాళ్ల మీద ఇన్నాళ్లుగా ఖర్చు పెట్టినదానికి దబులో త్రిబులో రిటర్న్‌గా రావటం కోసం అన్నట్టుగా మాట్లాడుతోంది. ఇదేం బాగుంది? కావేరి ఎందుకిలా మారిపోయింది? అని ఆలోచిస్తుంటే మనసంతా అదోలా అయిపోయింది.


ఆ కారణంగానే కాబోలు ఆ తర్వాత కావేరీతో అంత క్లోజ్‌గా మూవ్ కాలేకపోయాను.

"ఎందుకలా ముభావంగా ఉన్నావ్?" అంది ఆ సాయంత్రం.

"ఏం లేదు!" అని "నేను రేపు మార్నింగ్ వెళ్లిపోతాను" అన్నాను.

"అప్పుడే?"

"వెళ్లాలి"



## రంభ కొత్త కారు

రంభ ఇటీవలే బిఎండబ్ల్యూ-7.5 అనే కొత్త సిరీస్ కారుకి ఓనరైంది. సౌత్ ఇండియాలో ఆ మోడల్ తొలి కారు ఓనర్‌గా రంభ ఖ్యాతికెక్కింది. దాదాపు కోటిన్నర ఖరీదు చేసే ఈ కారుని ఆమెకి కెనడాకి చెందిన మాజిక్‌వుడ్స్ అనే కంపెనీ గిఫ్టుగా ఇచ్చిందిట. ఎందుకంటే త్వరలోనే ఆ కంపెనీ తాలూకు ప్రొడక్ట్స్ ఇండియన్ మార్కెట్‌లోకి వస్తున్నాయి. వాటికి బ్రాండ్ అంబాసిడర్ చాన్స్‌ని కొట్టేసిన రంభ- ఇప్పుడు ఎంచక్కా ఖరీదైన కారుని కూడా కానుకగా అందుకుందిట.

అంతే! ఆ తరువాత మరేం మాట్లాడలేదు కావేరి. మర్నాడు నన్ను డ్రాప్ చేయటానికి స్టేషన్‌కు వచ్చింది.

కారు డ్రైవ్ చేస్తూ "మళ్లీ ఎన్నాళ్లకు కలుస్తామో కదా?" అంది కావేరి.

"ఈసారి నువ్వే మా ఇంటికి రావాలి!" అన్నాను.

"తప్పక వస్తాను. నీలా ఒక్క దాన్ని మాత్రం కాదు.. పిల్లల్ని కూడా తీసుకుని వస్తాను. ఎందుకంటే మనం అలవాటు చేయంది పిల్లలకు సోషల్ లైఫ్ అలవాటు కాదు. నలుగురితో మూవ్ కావటం తెలియదు. ఒంటరిగా వాళ్లలో వాళ్లే పరిమిత జీవితం గడిపేస్తారు. సెల్‌ఫోన్, కంప్యూటర్ తప్ప మనుషుల గురించి భిన్నవిభిన్న జీవితాల గురించి వాళ్లకు అవగాహన ఉండదు!" అనగానే ఎప్పుడూ సిస్టమ్ ముందు కూర్చుని మాటా పలుకూ లేకుండా ఆ గదికి అంకితమై కూర్చునే మా అబ్బాయి, గేమ్స్, ఎస్.ఎమ్.ఎస్.లతో అరచేతిలో సెల్‌ఫోన్ చేత పట్టుకుని.. గంటలు గంటలు చెవి దగ్గర పెట్టుకుని తిరిగే మా అమ్మాయి గుర్తుకు వచ్చారు. అయినా నా మనసులో కావేరి మీద ఆల్రెడీ గూడుకట్టుకున్న వ్యతిరేక భావం వల్లనో ఏమో ఆమె మాటలను నేను పూర్తిగా అంగీకరించలేకపోయాను.

అంతేగాక ఏదో 'అడుగు.. అడుగు' అని 'లో'నుంచి నా మనసు తొందరపెట్టడంతో ఆరాటం అణుచుకోలేక కావేరీతో అన్నాను.

"పిల్లలకు సోషల్ లైఫ్ అలవాటు చేయాలి అన్న విషయం నేనూ అంగీకరిస్తా గానీ.. మన బాధ్యతగా పిల్లల్ని పెంచి పెద్ద చేసి.. ఒక కెరీర్‌కు మార్గం చూపించడానికి ప్రతిఫలంగా వాళ్లూ మన కోసం ఏదో చేయాలన్న కోరికను మాత్రం నేను అంగీకరించను. ఎందుకంటే అది స్వార్థం అవుతుంది?" అన్నాను.

అలా అనేశాక నా మనసు తేలికపడింది. కానీ- కావేరి అదోలా నవ్వింది.. ఆ నవ్వులో ఆత్మవిశ్వాసం తళుక్కున మెరిసింది.

"భవానీ! పిల్లలతో నా మాటలు నీకు తప్పుడు సంకేతాలను అందించి నన్నో స్వార్థపరురాలిగా నీ ముందు నిలిపాయని నేను గ్రహించాను. కానీ కాలాన్ని బట్టి మనమూ మారి మన మైండ్ సెట్‌లనూ మార్చుకోక తప్పటం లేదు. ఈ రోజుల్లో పిల్లలు ఒంటరి జీవితాలకు అలవాటు పడిపోతున్నారు. తమ చుట్టూ ఒక గిరిగీసుకుని అందులోనే బ్రతుకుతున్నారు. దీనివల్ల మానవసంబంధాలు దెబ్బతినడమే గాక పిల్లలు 'నేను.. నాది' అన్న సంకుచితపు ఆలోచనలకు అలవాటుపడిపోతున్నారు. వాళ్లను అటువైపు నుంచి 'మేము.. మన' అన్న విశాల దృక్పథం వైపు మళ్లించాలంటే వాళ్లను ఇప్పటి నుంచే అందుకు ప్రిపేర్ చేయాలి. ఆ ప్రయత్నంలో భాగంగానే వాళ్లతో నేనలా మాట్లాడాను. ఈ రోజు ఇంట్లో తల్లిదండ్రులనే పరాయివాళ్లుగా చూడటం నేర్చుకుంటే రేపు నా కూతురు పెళ్లి అయిన తర్వాత అత్తమామలను అస్సలు పట్టించుకోదు. ఈ రోజు తోబుట్టువుతో కలిసిమెలిసి ఉండటం నేర్చుకోకుంటే రేపు నా కొడుకు తన భార్య మనసును అర్థం చేసుకోలేడు. ఇది ఇప్పుడు కేవలం మా ఒక్క కుటుంబ సమస్యే కాదు సామాజిక సమస్యగా మారింది. దేశ సమస్యగా మారబోతోంది. కనుక ఉడతసాయంలా మనం ఎవరింటిని వాళ్లం చక్కదిద్దుకోగలిగితే అప్పుడు ఈ సమాజమే ఓ పెద్ద కుటుంబంలా మారి ప్రేమ నిలయంగా మారుతుంది" అంది కావేరి.

మంత్రముగ్ధలా అప్పటివరకూ తన మాటలను విన్న నాకు కావేరీని అపార్థం చేసుకున్నందుకు పశ్చాత్తాపం కలిగింది. ఆమె వ్యక్తిత్వం పట్ల గౌరవ భావం మరింత పెరిగింది. కావేరి ఏం మాట్లాడినా, ఏం చేసినా దాని వెనుక ఏదో ఉన్నతభావమే ఉంటుందన్న నిశ్చయానికి పూర్తిగా వచ్చేశాను ఆ క్షణంలో. 'ఈకాలం పిల్లలకు ఇచ్చింది పుచ్చుకోవటం... అదనంగా అది కావాలి.. ఇది కావాలి అని ఆశించటం తప్ప 'ఇవ్వటం'.. 'ఇవ్వటంలోని హాయిని అనుభవించటం' చేతకాదు. అందులో ఆనందం ఉంటుందన్న స్పృహ కూడా వాళ్లకు ఉండదు. కనుక ఆ అనుభవాన్ని పిల్లలకు రుచి చూపించడం పెద్దవాళ్లు చేయాల్సిన పని. అమ్మగా కావేరి చేస్తున్నది అదే పని. కావేరి ఏ స్థానంలో ఉన్నా ఏ పని చేసినా అందులో ఓ ప్రత్యేకత ఉంటాయి' అనుకున్నాను ప్రశంసాపూర్వకంగా.

○



## తెలుగులో సోనమ్?

అనిల్‌కపూర్ కూతురు సోనమ్ కపూర్ తెలుగు తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి అంటున్నారు సినీజనాలు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తయారుకానున్న కొత్త చిత్రంలో అల్లరి నరేష్ హీరో అయితే, హీరోయిన్‌గా ఇంకా ఎవరినీ అనుకోలేదట. కమల్ హాసన్ కూతురు శృతిని అడిగితే- నో చెప్పేసిందిట. అనిల్ కపూర్‌కి విశ్వనాథ్ పట్ల వున్న గౌరవభావంతో అతని కూతురు సోనమ్‌ని ఒప్పించగలడేమోనని ప్రయత్నిస్తున్నారట. కానీ బాలీవుడ్ బిజీగావున్న భామ టాలీవుడ్‌కి ఇప్పుడే వస్తుందా? అని సందేహపడుతున్నారు. చూద్దాం!